www.ghantaravam.com epaper.ghantaravam.com

# ఘంటారావమ్

దినపత్రిక

అన్యాయంపై అక్షర సమరం

సంపుటి : 17 పేజీలు : 5

సంచిక : 17 ధర : రూ.3.00

కరీంనగర్ గురువారం 23 ఏప్రిల్ 2026

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

4 లో..

- పరిస్థితి విషమం
- ఆత్మహత్యాయత్నం పాల్పడ్డ బాధితుడిని పరామర్శించిన ఎర్రబెల్లి, పెద్ది, సీపీ







### మే 5 నుంచి సమరమే..


ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆగ్రహంగా ఉన్న ఉద్యోగ సంఘాలు మరో సమరానికి సన్నద్ధమవుతున్నాయి. మే 5నుంచి రెండో దశ ఉద్యమానికి ఉద్యోగ జేపసీలు పిలుపునిచ్చాయి. కలెక్టరేట్ల ఎదుట నిరాహార దీక్షలు చేపట్టాలని ఒక జేపసే నిర్ణయించగా, మరో జేపసీ(లచ్చిరెడ్డి) అదే రోజున కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించాయి. ఈ నిరసనలతోనైనా ప్రభుత్వం దిగొచ్చి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తుందా? లేదా? అనేది వేచిచూడాల్సిందే. లేదంటే ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.






# ఉద్యోగులకు మొండిచేయి!




## సర్కారు నిర్ణయంతో గుబులు

- ఉద్యోగులు కోరిందొకటి.. ప్రభుత్వం చేసిందొకటి!
- పీఆర్సీ, పెండింగ్ బిల్లులకు బదులు బదిలీల బహుమతి
- అసలు డిమాండ్లను అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- డీఏలకు మంగళం.. హెల్త్ కార్డులకు ఎగనామం
- బదిలీల బహుమానంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహం

(బీ.కే) ప్రత్యేక ప్రతినిధి, ఘంటారావమ్ :

ప్రభుత్వానికి మంచిపేరు రావాలంటే ఉద్యోగులు సక్రమంగా పనిచేయాల్సి ఉంటుంది. వారు సక్రమంగా పనిచేయాలంటే వారికి అవసరమైన వసతులు, వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వారిని విస్మరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వారి న్యాయమైన డిమాండ్లు పక్కనపెట్టిన ప్రభుత్వ విధానాలపై కొలువుదారులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. డీఏలు, పీఆర్సీ లాంటి ఆకాంక్షలను ప్రభుత్వం అటకెక్కించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ

మిగతా 4వ పేజీలో..



### భద్రకాళీ భద్రేశ్వరుల ఐదవ రోజు

## బ్రహ్మోత్సవాలు

వరంగల్ భద్రకాళీ, ఘంటారావమ్ :

భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవాలు ఈ రోజుతో ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన తదుపరి చతుస్థానార్చన జరిపి అమ్మవారిని సూర్యప్రభ వాహనం పైన సాయంకాలం హంస వాహనం పైన ఊరేగింపు జరిపారు. జయచంద్ర దివాకరనేతధలే అని శాస్త్రాలు అమ్మవారిని స్తుతిస్తున్నాయి. సూర్యచంద్రులకు అమ్మవారు నేత్రములుగా కలిగి ఉన్నదని అర్ధం. ప్రకాశానికి ప్రతీక సూర్యుడు. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అని పురాణాలు చెబుతున్నాయి. సూర్యప్రభ వాహనం మీద సేవింప బడుతున్న అమ్మవారిని దర్శించిన భక్తుల జీవితం దేదీప్యమానంగా ఉంటుంది. మంచి ఆరోగ్యం, కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి. నేత్రరోగాలు పోతాయి. అంతరదృష్టి, బాహ్యదృష్టి బాగా పనిచేస్తాయి. హంస జ్ఞానానికి ప్రతీక, పాలలోని నీళ్ళను వదిలేసి కేవలం పాలు మాత్రమే స్వీకరిస్తుంది హంస. దీన్నే క్షీరవీర న్యాయం అంటారు. హంస వాహనం మీద ఊరేగింపబడుతున్న అమ్మవారిని సేవించిన వారికి విరక్షణా జ్ఞానం బాగా పెరుగుతుంది. తద్వారా ధర్మాధర్మ విచక్షణ కలిగి సమాజ హితముగా ప్రవర్తిస్తారని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. సూర్యచంద్రులు దివారాత్రములకు అధిపతులు, సూర్యుడు

మిగతా 4వ పేజీలో..



### గర్భిణీలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :

గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా

మిగతా 5వ పేజీలో..

## కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు సర్కార్

5 లో..

www.ghantaravam.com

నిత్యం ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా నిలుస్తూ, నిజాలను నిర్భయంగా, వాస్తవ కథనాలను అందించడమే ధ్యేయంగా, అన్యాయంపై అక్షర సమరం సాగించడానికి పుట్టిందే ఘంటారావమ్ దినపత్రిక..

ఇప్పుడు.. మన పత్రిక

మీకు మరింత చేరువలో..

epaper.ghantaravam.com





ఘంటారావమ్
జనరల్
General
గురువారం
23 ఏప్రిల్, 2026
www.gantaravam.com


# నాటుసారాను బంద్ చేయించుండ్రి!

- ఎమ్మెల్యే దొంతికి బోనగిరి ప్రమీల వినతి
- ఎక్సైజ్ అధికారులను పిలిపించాలని ఎమ్మెల్యే ఆదేశాలు




సభలో మాట్లాడుతున్న భోనగిరి ప్రమీల, తహసీల్దార్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే దొంతి

దుగ్గొండి, ఘంటారావమ్ :

నాటుసారాతో కుటుంబాలు ఆగమవుతున్నాయని, తమ ఊరిలో నాటుసారా లేకుండా చేయాలంటూ మండలంలోని చాపలబండ గ్రామస్తురాలు బోనగిరి ప్రమీల ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి నిండు సభలో విన్నవించింది. చాపలబండలో బుధవార మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే.. బోనగిరి ప్రమీల ఎమ్మెల్యే సారూ.. అంటూ తన ఆవేదనను వెలిబుచ్చింది. ఊళ్లో నాటు సారా ఫుల్లుగా అమ్ముతున్నారని, దాంతో చాలామంది జీవితాలు ఆగమవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చింది. ఎలాగైనా నాటుసారా అమ్మకుండా చూడాలని కోరింది. సభలో ఉన్న ఇతర మహిళలు కూడా ప్రమీలకు మద్దతు పలికారు. ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులతో చర్చించి, నాటు సారాపై ఉక్కుపాదం మోపాలని తహసీల్దార్ సమ్మక్కను ఎమ్మెల్యే ఆదేశించారు. నాటుసారాపై ప్రమీల ధైర్యంగా ఎమ్మెల్యేకు విన్నవించడం పట్ల గ్రామస్తులంతా అభినందించారు.

## వీవో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

దుగ్గొండి, ఘంటారావమ్ :

మండలంలోని చాపలబండ గ్రామానికి గురువారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, గొల్ల కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం వీవో బిల్డింగ్‌కు భూమి పూజను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాపల బండ గ్రామానికి ఉపాధి హామీ పథకంతో రూ.10 లక్షల నిధులతో వివో భవణం పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. వివో భవనం మరింత విశాలంతో పాటు ఉండేందుకు, అన్ని విధాల సదుపాయాలు ఉండేందుకు అవసరమైతే మరో 10 లక్షలకు పైనే అదనంగా నిధులను కేటాయింప జేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా అంగన్‌వాడీ నూతన భవనానికి రూ. 12 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ లెక్కల అరుంధతి, తహశీల్దార్ ముసుకు సమ్మక్క సర్పంచ్ అల్లాటి ప్రభు, ఏపిఎం ఈద రమేష్ కుమార్, ఏపీవో శ్రీనివాస్, డీఈ శ్రీకాంత్ రెడ్డి, పీఆర్ ఏఈ రజనీకాంత్, వివో అధ్యక్షురాలు, సీసీలు, వీవోఏ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.





## తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం

మల్కాజిగిరి, ఘంటారావమ్ :

నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత తన ఇద్దరు చిన్నారులతో కలిసి అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, శక్తి నగర్‌కు చెందిన కె. అంజు (28), ప్రైవేట్ ఉద్యోగి, ఈ నెల 21వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటలకు తన ఇద్దరు పిల్లలు దత్తా (2), తేజశ్రీ (2)లతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అంజు ఎత్తు సుమారు 5 అడుగులు ఉండి, పంజాబీ దుస్తులు ధరించి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె తెలుగు, ఒడియా, నేపాలీ, హిందీ మాట్లాడగలదని సమాచారం. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో భర్త కె. చందు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఈ ఘటనపై నేరేడ్‌మెట్ పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేసి, వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు.



## నిమ్స్‌లో కూలర్లు ఏర్పాటు

లయన్ డా.చేకూరు హనుమంతునాయుడు

హైదరాబాద్, ఘంటారావమ్ :

హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ ఆవరణలో రోగులు, వారి బంధువుల సౌకర్యార్థం లయన్ డా.చేకూరు హనుమంతునాయుడు 10 కూలర్లను ఏర్పాటు చేశారు. నిత్యం వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వస్తుంటారని, వేసవిలో చల్లదనం కోసం ఇలాంటి సదుపాయాలు అవసరమని అన్నారు. అందుకే కూలర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి సేవల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డాక్టర్ లక్ష్మీ భాస్కర్, డాక్టర్ల బృందం, లయన్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.



## ముప్పారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం

ధర్మసాగర్, ఘంటారావమ్ :

ముప్పారంలోని గోదాం ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ రేణుక ప్రారంభించారు. ఈ సీజన్‌లో ధాన్యం దిగుబడులు ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పండిన ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసేలా ఐకెపి సెంటర్లను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమం లో ఉపసర్పంచి తాళ్లపల్లి కుమారస్వామి గౌడ్, వార్డు సభ్యులు శ్వేత సాగర్, శోభ మల్లయ్య, ప్రణీత సలీం, మాజీ సర్పంచులు గొల్లపల్లి వెంకట్రాజం, గోనెల సమ్మక్క రాజన్న, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



## హిందూ సమ్మేళనం విజయవంతం చేద్దాం

పరకాల, ఘంటారావమ్:

పరకాలలో ఈనెల 28న శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న హిందూ ధర్మ సమ్మేళనంను విజయవంతం చేయాలని సమితి ఉపాధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ దేవస్థానం చైర్మన్ గందే వెంకటేశ్వర్లును సత్కరించి, కరపత్రం అందజేస్తూ ఆహ్వానించారు. హిందూ సమాజాన్ని చైతన్య పరిచి, దేశాన్ని తిరిగి విశ్వగురువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే హిందువుల ఐక్యత అవసరమని పేర్కొన్నారు. హిందూ సమాజంలో గౌరవం, సేవాభావం, సంస్కృతి పరిరక్షణ వంటి విలువలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ప్రైవేట్ బడి అనుమతి రద్దు చేయండి!



ధర్మసాగర్, ఘంటారావమ్:

ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో ప్రైవేటు స్కూళ్ల అనమతులు రద్దు చేయాలంటూ ఆ గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక విద్యాశాఖను కోరినట్లు తెలిపారు. పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తే ప్రభుత్వ పథకాలు అందకుండా చేస్తామని గ్రామస్తులను హెచ్చరించారు. పంచాయతీ పాలకవర్గం కూడా తీర్మానం చేసిందని చెప్పారు. గురువారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో సర్పంచ్ ఈ మేరకు ప్రకటించారు. గ్రామాభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొస్తున్నా మని, ఇందులో భాగంగా ప్రభుత్వ బడిలో విద్యార్థుల పెంపు కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వార్డులవారీగా 5వ తరగతి వరకు చదివే విద్యార్థుల జాబితా తయారు చేయడంతోపాటు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే వారిని గుర్తిస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపించే వారి కుటుంబాలకు పెన్షన్లు, రేషన్ బియ్యం పంపిణీ నిలిపివేస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కూడా పేర్లు తొలగిస్తామని వెల్లడిం చారు. మొదట ప్రైవేటు స్కూళ్లకు నోటీసులు అందించి, ఆ తర్వాత ఆ స్కూళ్ల అనమతులు రద్దు చేయాలని విద్యా శాఖను కోరుతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి గౌడ్, వార్డు సభ్యులు శ్వేత సాగర్, ఎతిరాజుల శోభ మల్లయ్య, గోకుల ప్రణీత సలీం, హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు చల్లా ధర్మారెడ్డి సంఘీభావం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



పరకాల, ఘంటారావమ్:

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సంఘీభావం తెలిపారు. పరకాల డిపోవద్ద సమ్మె శిబిరాన్ని చల్లా సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మిక నాయకులతో వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికే ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ స్పందించి కార్మికుల డిమాండ్లను నెరవేర్చకపోతే ఉద్యమం మరింత ఉధృమవుతుందని హెచ్చరించారు.



## ప్రజా సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మల్కాజిగిరి ఎమ్మెల్యే ఫైర్

మల్కాజిగిరి , ఘంటారావమ్ :

మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రెండున్నరేళ్లుగా అభివృద్ధిపై కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన పని ఒక్కటీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడిగా నిలిచిందని, ఈ విషయంలో నిజం బయటపడిందని ఎమ్మెల్యే తెలిపారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, తోట నరేందర్ రెడ్డి, అరుణ్ రావు, డోలి రమేష్, కరంచంద్, ప్రభాకర్ గౌడ్, ఉస్మాన్, లక్ష్మణ్ యాదవ్, శోభన్ బాబు, శ్రీధర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, మహేష్ , శరణ గిరి, మారుతి ప్రసాద్, సురేష్ , జె.కే.సాయి గౌడ్, శివ సాయి యాదవ్, కేబుల్ రమేష్ , శోభా పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం గ్రాడ్యుయేషన్ డే



పరకాల, ఘంటారావమ్:

పరకాల మండలం నాగారం రైతు వేదిక ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగ న్వాడి ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే, జాతీయ పోషణపక్షం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల ఆర్డీవో నారాయణ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. నాగారం సర్పంచ్ ఎరుకొండ రమాదేవి శ్రీనివాస్, లక్ష్మీపురం సర్పంచ్ పల్లెబోయిన గీతారాణిరాజు పాల్గొని మాట్లాడారు. తల్లిబిడ్డ ఆరోగ్యం, 6 సం వత్సరాల లోపు పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి కోసం అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఆటపాటల ద్వారా విద్య అందిస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు సూపర్వైజర్ రాణి తెలిపారు. 3-4 సంవత్సరాల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, 4-5సంవత్సరాల పిల్లలకు యూకేజీస్థాయిలో అక్షరాలు, అంకెల పరిచయం కల్పించి, సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన పిల్లలకు ఆర్డీవో చేతు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. నాగారం సెక్టార్‌లోని 26 అంగన్వాడి కేం ద్రాలకు అవసరమైన చాపలను ఆర్డీవో విరాళంగా అందించారు. అంగన్వాడి కేం ద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేస్తాయని, పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ కళ్యాణి, రాకెట్ లెర్నిం గ్ ఎన్‌జీఓ ప్రతినిధి రెజ్వానా, పంచాయతీ సెక్రెటరీ కిరణ్, వార్డ్ సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, తల్లిదండ్రులు సుమారు 50 మంది చిన్నారులు పాల్గొన్నారు.



## సాయిబాబా గుడి 40వ వసంత వేడుకలు

హన్మకొండ, ఘంటారావమ్:

హన్మకొండ బాలసముద్రంలోని ఏషియన్ శ్రీదేవి మాల్ పక్కన ఉన్న షిరిడిసాయి సేవాసమాజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సాయిబాబా మందిరం స్థాపనకు 40 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కేక్ కట్‌చేసి భక్తులకు పంపిణీ చేశారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ మాట్లాడుతూ ఆలయ విశేషాలు, చరిత్ర, భక్తుల సహకారం, ఆలయం అభివృద్ధికి భక్తుల అంకితభావం కీలకమని ఆయన పేర్కొన్నారు. తనకు సహకరిస్తున్న తోటి ధర్మకర్తల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్మకర్త, మందిర పిఆర్‌ఓ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, పూసా సురేష్ కుమార్, మందిర పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, సిబ్బంది సాయికృష్ణ, రాజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ పంపిణీ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక భావనను మరింత పెంపొందించేలా విజయవంతంగా జరిగింది.

## కార్యకర్తకు కొండ శ్రీను ఆర్థికసాయం



హన్మకొండ, ఘంటారావమ్:

గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ చేతుల మీదగా ఏడవ డివిజన్‌కు చెందిన నెల్లుట్ల సారంగం ఆరోగ్య రీత్యా బాధపడుతూ ఉండగా ఏడవ డివిజన్ అధ్యక్షుడు కొండ శ్రీనివాస్ మానవత్వంతో 5000 ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఏడవ డివిజన్‌కు చెందిన జుబేర్, సుదర్శన్, శ్రీనివాస్, సరస్వతి, దేవి, విజయ, రమ పాల్గొ న్నారు. ఇలాంటి సేవలు మరెన్నో చేయాలని కొండ శ్రీనివాస్ ని దాస్యం వినయ్ భాస్కర్ అభినందించారు.

# ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని అంటించుకున్న ఉద్యోగి
- పరామర్శించిన మాజీమంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది

**నర్సంపేట, ఘంటారావమ్:**

నర్సంపేట డిపోలో ఆర్టీసీ డ్రైవర్ నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది.కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన తమ డిమాండ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న మనస్తాపంతో డ్రైవర్ శంకర్‌గౌడ్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నట్లు తెలుస్తోంది. స్థానికుల వివరాల ప్రకారం నర్సంపేట డిపోకు చెందిన కోలా శంకర్ గౌడ్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు.తోటి సిబ్బంది వెంటనే మంటలు ఆర్పి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.దీంతో కార్మికులు డిపో ఎదుట ఆందోళనకు దిగి, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు.







## పరామర్శించిన ఎర్రబెల్లి, పెద్ది

ఆత్మహత్యయత్నానికి పాల్పడిన శంకర్‌గౌడ్‌ను ఎంజిఎం ఆసుపత్రిలో మాజీ మంత్రి ఎర్ర బెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ హామీని తుంగలో తొక్కి నట్లు ఆరోపించారు. రెండున్నర ఏండ్లుగా హామీని విస్మరించి కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు

**వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద.**

**హన్మకొండ, ఘంటారావమ్:**

వరంగల్ జిల్లాల అర్హులైన పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్‌లు ఇస్తామని వరంగల్ కలెక్టర్,అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు జారీ అయ్యేలా కమిటీ సభ్యులు ప్రయత్నించాలని సూచించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందేలా చూడాలన్నారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆమె పేర్కొన్నారు. ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని జర్నలిస్టులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిపిఆర్‌ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీరాశీ రాశీచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బోడిగ శ్రీనివాస్, మట్టా దుర్గా ప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు పాల్గొన్నారు.



# 33 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం

- హైదరాబాద్‌లో మహిళల ర్యాలీ
- పాల్గొన్న మల్కాజిగిరి బిజెపి నాయకులు

**మల్కాజిగిరి, ఘంటారావమ్ :**

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో జరుగుతున్న ఆలస్యంపై నిరసనగా నగరంలో మహిళా ఆక్రోశ్ ర్యాలీ గురువారం నిర్వహించారు. జిహెచ్‌ఎంసి ఏవి కాలేజ్ నుండి ఇంద్ర పార్క్ వరకు జరిగిన ఈ ర్యాలీలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా మహిళలు తమ హక్కుల కోసం నినాదాలు చేస్తూ, రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడంలో రాజకీయ పార్టీలు స్పష్టమైన వైఖరి తీసుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో మహిళలకు తగిన స్థానం కల్పించడం అత్యంత ముఖ్యమని, చట్టసభల్లో వారి భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రవణ్, సునీల్, బలరాం, ప్రసన్న, అంజలి, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంలో మృతదేహం లభ్యం

**ఘంటారావమ్ డెస్క్:**

హైదరాబాద్ నగరంలోని విజయనగర్ కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏటీఎంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు మెహదీపట్నం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఏటీఎం తలుపు తెరిచి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఆ వ్యక్తి ఏటీఎంలోకి వెళ్లిన తర్వాత తలుపు లాక్ అవడంతో లోపలే ఊపిరాడక మృతి చెందినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# మొక్కజొన్న రైతులకు మద్దతుగా పెద్ది నిరసన

**దుగ్గొండి, ఘంటారావమ్ :**

మండలంలోని వెంకటాపురం గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు సెంటర్ వద్ద గురువారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిరసన చేపట్టారు. వెంకటాపురంలోని కొనుగోలు సెంటర్లో రైతులు నెల రోజులుగా కాంటాలు కాకుండా ఉన్న సందర్భాలు నెలకొన్నాయన్నారు. మొక్కజొన్న రైతులు పడుతున్న కష్టాలను చూడలేకనే నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. దుగ్గొండి మండలంలో మొక్కజొన్న పంట ఎకరాకు 40 క్వింటాళ్ళ దిగుబడి వస్తే సెంటర్లో మాత్రం ఎకరాకు 26 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన 14 క్వింటాళ్ళు ఇంటికి తీసుకు వెళ్లమని వాపస్ పంపించే పరిస్థితి నెలకొనడం ఎంతో ఆవేదనకు గురిచేస్తోందన్నారు. అదనంగా సొసైటీలలో సెంటర్లు ప్రారంభించాలని, తక్షణమే రైతులకు గోనె సంచులు ఇవ్వాలని, కాంటాలు పెట్టి రైతులను పంపించాలని, వెంటనే ట్రాన్స్పోర్ట్ చేయాలని పెద్ది డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, ఎన్ఆర్ఐ శానబోయిన రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుకినె రాజేశ్వర్‌రావు, గ్రామపార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ గెలిస్తే చొరబాట్లు ఉండవు : అమిత్‌షా

**ఘంటారావమ్ డెస్క్:**

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోకి అక్రమంగా ఎవ్వరూ చొరబడలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఒక్కరిని కూడా అక్రమంగా రానివ్వబోమని ప్రజలకు హామీ ఇచ్చారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హుగ్లీ జిల్లా, బాలాగర్‌లో గురువారం జరిగిన ప్రచార కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్కరిని కూడా అక్రమంగా చొరబడనివ్వం. ఇప్పటికే ఉన్న అక్రమ చొరబాటుదారుల్ని గుర్తించి, పంపించివేస్తాం. బెంగాల్ ఆర్థిక వ్యవస్థకు, భద్రతకు అక్రమ వలసదారులు హానికలిగిస్తున్నారు. రాష్ట్ర యువతకు దక్కాల్సిన ఉద్యోగాలు, రేషన్ వంటివి దోపిడీ చేస్తున్నారు. దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతు న్నారు. మీరు ఇప్పుడు ఓటు వేయబోయేది ఒక ఎమ్మెల్యే కోసమో.. బీజేపీ ప్రభుత్వం కోసమో కాదు. అక్రమవలసదారుల నుంచి రాష్ట్ర విముక్తి కోసం కూడా. ఈ రోజు బెంగాల్ తొలి దశ ఎన్నికలు ముగుస్తున్నాయి. ఇది బెంగాల్‌లో నా 30వ ప్రచార సభ. రెండో దశ ఎన్నికల్లో కూడా బీజేపీకి ఓటు వేయండి. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుంది" అంటూ అమిత్ షా వ్యాఖ్యానించారు. గురువారం పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ తొలిదశ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సాయంత్రం ఐదు గంటల వరకు దాదాపు 89 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో పూర్తి ఎన్నిక ముగిసే సరికి ఇంకా భారీ ఓటింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. రెండో దశ ఎన్నికలు ఈ నెల 29న జరుగుతాయి. మే 4న ఫలితాలు విడుదలవుతాయి.



# కాళేశ్వరంపై కాంగ్రెస్ కావాలనే కుట్రలు

## కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఆరోపణలు

**ఘంటారావమ్ డెస్క్:**

కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ నాయకులకు బుద్ధిరావాలని, కాళేశ్వరం కమీషన్ పై హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. గురువారం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఘోష్ కమీషన్ పేరిట మూడేళ్లుగా కేసీఆర్ పై కక్షగట్టి రాజకీయాలు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. పీసీ ఘోష్ కమీషన్ కాదని పీసీసీ నివేదిక అని బీఆర్ఎస్ పార్టీ చెప్పిందే నిజమైందని హైకోర్టు తీర్పుతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, బరాజ్ లు, ఎన్నో కాలువలు, సొరంగాలు, పంప్ హౌస్ ల సమాహారమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద కుంగిన పిల్లర్లకు సొంత ఖర్చులతో మరమ్మత్తు చేసేందుకు నిర్మాణ సంస్థ ఎల్అండ్ టీ ముందుకు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. మూడు, నాలుగు వందల కోట్లు వెచ్చిస్తామని ఒప్పుకున్న బెదిరించి పారిపోయేటట్లు చేశారని ఆరోపించారు. కాళేశ్వరం బాగుపడితే కేసీఆర్‌కు పేరు వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి కుట్రలకు తెరలేపాదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రూ. లక్ష కోట్లు నీళ్ల పాలయ్యాయని నోటికొచ్చినట్లు మాట్లాడిన కాంగ్రెస్ నాయకులకు మళ్లీ కాళేశ్వరం ప్రాజెక్టే దిక్కయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు.

### కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం..

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. గోదావరి నుంచి వృధాగా పోతున్న నదీ జలాలను ఒడిసిపట్టి బరాజ్ లను నిర్మించి వందల టీఎంసీల నీటిని కాపాడారని చెప్పారు. నిండు ఎండకాలంలోను రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా కేవలం మేడిగడ్డ బారజ్ వద్ద టీఎంసీ నీళ్లు పారుతున్నాయని తెలిపారు. కాళేశ్వరమే రాష్ట్రానికి ప్రాణాధారమని తెలంగాణకు త్రాగునీరు, లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అద్భుతమైన ప్రాజెక్టు అని కొనియాడారు. సీఎం ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని కుంగిన రెండు పిల్లర్లకు వెంటనే మరమ్మత్తులు చేయించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు పణంగా పెట్టి రాజకీయాలు చేయవద్దని సీఎంకు ఎమ్మెల్యే హితవు పలికారు. ఎల్నీనో ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే ఏడాది వర్షపాతం తక్కువగా ఉండబోతుందనే హెచ్చరికలతో సీఎం మేడిగడ్డకు పరిగెత్తుకుంటూ వెళ్లారని ఎద్దేవా చేశారు.







# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

**పరకాల, ఘంటారావమ్:**

మండలంలోని మల్లక్కపేటలో టీపీసీసీ మాజీ ఉపాధ్య క్షులు దొమ్మటి సాంబయ్య ఆదేశాల మేరకు దొమ్మటి సరోజన, బొల్లికొండ సుజాత, కాత్మండి మార్కండేయ, డోకుల లలిత, సంధ్యలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ అర్హులైన కుటుంబాలకు గృహ నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పేద కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేయాలని కవిత మధు తెలిపారు.



# విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలం

**సర్పంచ్ బిల్లా యాదగిరి**

**వేలేరు, ఘంటారావమ్ :**

విద్యతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలమని సర్పంచ్ బిల్లా యాదగిరి విద్యార్థులకు సూచించారు. గురువారం వేలేరు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిధులు మంజూరు చేశారని, ప్రహరీ గోడ నిర్మించినట్లు తెలిపారు.అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఎస్సై రాంమోహన్ ఆన్‌డ్యూటీ!

**నర్సంపేట, ఘంటారావమ్:**

వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఖానాపురం ఎస్సైగా రాంమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రఘుపతి బదిలీపై వీఆర్ కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.





# జిలుకర 'ఏకాంతం' సేవలు ప్రశంసనీయం..

**హనుమకొండ, ఘంటారావమ్ :**

హనుమకొండ ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు 'జిలుకర ఏకాంతం' పదవీ విరమణ ఆత్మీయ సన్మాన అభినందన సభ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీ. రమేష్ లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సహచర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు జిలుకర ఏకాంతం విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. వారి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం జిలుకర ఏకాంతం మాట్లాడుతూ.. గత 27 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా వృత్తినే దైవంగా బావిస్తూ, ఎంతోమంది విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో విద్యా బుద్ధులు నేర్పి, భావిభారత పౌరులుగా







ఉన్నత శిఖరాలకు చేర్చినట్లు తెలిపారు. విద్యా బోదనే లక్ష్యంగా పనిచేసినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, బంధుమిత్రులు జిలుకర ఏకాంతం–సుజాత దంపతులను శాలువాలతో, పూల బుకేలతో, మేమేంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫిజికల్ డైరెక్టర్ శోభ, ఉపాధ్యాయులు జ్యోతి, రాజ్ కుమార్, నరేందర్, ఉమ, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, జిలుకర ఏకాంతం మామ కందుకూరు వెంకటయ్య, అత్తమ్మ యశోదా, సోదరులు, మరదల్లు జిలుకర శ్రీనాథ్ అలివేల, సాంబమూర్తి, శుభోధర, కుమారుడు జిలుకర సాహిత్, కోడలు సుస్మిత, మనువడు సహర్ష్, కూతురు జిలుకర విజేత, కుటుంబ సభ్యులు, సిబ్బంది, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు సాఫీగా సాగాలి

**హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :**

భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేసి, మట్టి తరలింపు ప్రక్రియను సాఫీగా నిర్వహిస్తూ, మే 15 నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.

గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపుపై సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు నుండి మట్టి డంపింగ్ ప్రాంతాల వరకు వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు పరిస్థితులు తదితర అంశాలపై సాగునీటి పారుదల, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, కుడా అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భద్రకాళి చెరువు పూడిక మట్టిని రెడ్డిపురం, పలివేల్పుల, మామునూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేయాలని సూచించారు. మట్టి



తరలింపులో ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానుల నుండి మట్టి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని, గతంలో అనుసరించిన విధానానికి అనుగుణంగా అవసరమైన మట్టికి డీడీలు చెల్లించి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెగ్యులేటరీ పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, పూడిక మట్టి తరలింపు ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై.వి. గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటి పారుదల సీఈ సుధీర్, ఎస్‌ఈ రాంప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈఈ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి

**హనుమకొండ జిల్లా /భీమదేవరపల్లి, ఘంటారావమ్ :**

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుండి ధాన్యం వస్తోంది, టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది, ధాన్యం నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు వంటి అంశాలను కలెక్టర్ అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత కార్యకలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించి, అక్కడి కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన పొందారు. సహకార సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ములుకనూరు సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీసీఎస్‌వో వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు మొండిచేయి!

మొదటి పేజీ తరువాయి

డిమాండ్లపై సర్కారు దిగొచ్చినట్టు చేసి.. తీరా మొండిచేయి చూపిందని బాహాటంగానే మండిపడుతున్నారు. తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

### నోరు ఒకటనుకుంటే నొసలు వేరే అనుకున్నట్టు!

నోరు ఒకటనుకుంటే నొసలు వేరే అనుకున్నట్టు అనే సామెత ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలకు, సర్కారు అనుసరిస్తున్న విధానాలకు సరిగ్గా సరిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నారు. వాస్తవానికి ఉద్యోగులు తమకు హెల్త్ కార్డులు, మే 1 నుంచి నగదు రహిత వైద్యం, జూన్ 2 కల్లా మెరుగైన ఫిట్మెంట్తో పీఆర్సీ, ఏకమొత్తంగా పెండింగ్ బిల్లులు విడుదల, పాత పింఛన్ పునరుద్ధరణ, కరువు భత్యం విడుదల చేయాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కానీ, ప్రభుత్వం వీటన్నింటినీ పక్కన పెట్టి బదిలీల ఫైలును ముందేసుకోవడంపై ఉద్యోగుల జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉద్యోగుల ఆకాంక్షను అటకెక్కించేందుకు రేవంత్రెడ్డి సర్కారు బదిలీల బాగోతానికి తెరలేపిందని మండిపడుతోంది.

### ఉద్యోగులంటే చిన్నచూపు?

కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగ సంఘాలన్నీ ఏకమయ్యాయి. ఉద్యమానికి సిద్ధమయ్యాయి. 206 సంఘాలు జత కట్టాయి. ఇటీవల లంచ్ టైంలో నిరసనలు చేపట్టారు. మరో జేఏసీ (లచ్చిరెడ్డి) అధికారులకు వినతిపత్రాలు సమర్పించింది. ప్రభుత్వ పరిపాలనకు కేంద్ర బిందువైన సచివాలయంలోనూ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు. దీంతో సర్కారు దిగొచ్చినట్టుగా చేసి.. బదిలీల అస్త్రాన్ని సంధించిందని ఉద్యోగులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

మే ఒకటో తేదీ నుంచి హెల్త్ కార్డులు అందించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తే.. సర్కారు మాత్రం బదిలీల ప్రక్రియకు గ్రీన్సిగ్నల్ ఇవ్వడాన్ని ఉద్యోగ సంఘాలు ఆకలింపు చేసుకోలేకపోతున్నాయి. ఉద్యోగుల పట్ల సర్కారు అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తున్నారు. 'డీఏ అంటే డిలే అలవెన్స్' అని పీఆర్సీ అంటే "పెండింగ్ రివిజన్ కమిషన్' అనే సెటైర్లతో పరోక్షంగా సర్కారును ఘాటుగా విమర్శిస్తున్నారు.

# భద్రకాళీ భద్రేశ్వరుల ఐదవ రోజు బ్రహ్మోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

జగత్తుకు వెలుగు ప్రసాదిస్తూ అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న జీవులను తరింపజేస్తాడు. పగలంతా తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో అలసియున్న జీవులకు చంద్రుని వెన్నెల చల్లదనం స్వాంతన చేకూరుస్తూ గాఢ నిద్రను అందించడమేగాక అలసట నివారించి శక్తిమంతులను జేస్తుంది. ఆ దివారాత్రములకు అధిపతులైన సూర్యచంద్రులను నేత్రములుగా ధరించి సకల ప్రాణుల జీవన వ్యవహారాలను నియంత్రిస్తుంది జగన్మాత.






## దివి నుంచి భువికి గంగా జలాన్ని తెచ్చిన
# మహనీయుడు భగీరథ మహర్షి
### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :**

లోక కల్యాణం కోసం దివి నుంచి భువికి పవిత్ర గంగాజలాన్ని తీసుకువచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ అధికారికంగా నిర్వహిస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహ స్వామి, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నలుబోల సతీష్, సగర సంక్షేమ అధ్యక్షుడు సీతా కమలాకర్ రావు, నెక్కొండ కిషన్, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి, రాష్ట్ర సగర మహిళా అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, తాడిశెట్టి విద్యాసాగర్, అయోధ్య మంగనూరి రఘు, కోడిపాక గణేష్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో
# చలివేంద్రం ఏర్పాటు

**సుబేదారి, ఘంటారావమ్ :**

హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజపాయి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో.. హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎన్.రవి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం అన్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ.. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు
# చెప్పేవన్నీ అబద్ధాలే..

**హైదరాబాద్, ఘంటారావమ్**

కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్ధాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు. '24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయింది? సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోంది? బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండి' అని డిమాండ్ చేశారు. మాని పోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నార న్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందన్నారు.

Edited, Printed, Published and Owned by Bollepelly Kishan, Printed at Sathyanarayana Printers, H.No 28-5-474/3, Reddypuram, Sai Krupa Colony, - 506001, Hanumakonda Dist. Telangana State.
Published at H.No. 10-3-488, OPP : RTC Workshop, Karimnagar- 505001, Karimnagar Dist. Telangana State. Editor : Bollepelly Kishan, RNI No : APTEL/2009/28812, Cell: 8978392904, Email: journalistkishan@gmail.com

ఘంటారావమ్ దినపత్రిక

అన్యాయంపై అక్షర సమరం

జనరల్

General

గురువారం

23 ఏప్రిల్, 2026

www.gantaravam.com




# విబి గ్రామ్ జీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేక చట్టమే..

- పాత చట్టాన్నే కొనసాగించాలి
- కూలీల హక్కులను కాలరాస్తున్న కేంద్ర సర్కారు
- నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలి
- డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్




**హసన్‌పర్తి, ఘంటారావమ్ :**

కేంద్రం తీసుకువస్తున్న విబి గ్రామ్ జీ బిల్లు 2025 భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన చట్టమేనని, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండి ఉపాధి చట్టాన్ని అడుగడున ఉల్లంఘిస్తూ కూలీల హక్కులను కాలరాస్తుందని, పాత పద్ధతిలో ఉపాధి హామీ పనిని కొనసాగించాలని, విబి గ్రామ్ జీ చట్టాన్ని కూలీలు సంఘటితమై తిరస్కరించాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూలీల పక్షాన నిలబడి విబి గ్రామ్ జీ బిల్లుకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా రద్దు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలోని పాత చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలతో పనివద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ.. కూలీలకు గత మూడు నెలలుగా పనిచేస్తున్న నేటికి వేతనాలు రాలేదని కూలీలు వాపోయరన్నారు. ఎండలు మండుతున్నందున పనులవద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవారాజన్ 14వ పైనాన్స్ కమీషన్ సంబంధించి కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, ఓఆర్ఎస్, ప్యాకెట్స్, మజ్జిగ, మంచినీరు అందించాలని గ్రామ పంచాయతి సర్పంచ్, కార్యదర్శులకు సర్క్యూలర్ జారి చేశారని, దానిని అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనని అన్నారు. బిజెపి సర్కారు కూలీల గొంతు నొక్కేందుకే కొత్త కొత్త విధానాలను తీసుకువస్తుందని, విబి గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి కూలీల హక్కులను కాపాడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూలీలు పాత పద్ధతిలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటునే, కొత్తగా తెచ్చిన విబి గ్రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# పింగిళి డిగ్రీ కళాశాలలో ఆంగ్లభాషా దినోత్సవం!

**హనుమకొండ, ఘంటారావమ్ :**




హనుమకొండ జిల్లా వడ్డేపల్లి లోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎ)లో ఆంగ్ల భాషా దినోత్సవం కళాశాల ఆంగ్ల విభాగం అధ్వర్యంలో ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి అధ్యక్షతన విలియం షేక్స్‌పియర్‌కు అద్భుతమైన నివాళి అర్పిస్తూ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. షేక్స్‌పియర్ నాటకాలలోని ప్రసిద్ధ పంక్తులను విద్యార్థులు పలకడంతో కార్యక్రమం ప్రారంభమైంది.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. షేక్స్‌పియర్ నాటకాలలోని ప్రసిద్ధ కొటేషన్లు విద్యార్థులు పలకడంతో ఈ కార్యక్రమ ఘనంగా ప్రారంభమైంది. షేక్స్ స్పియర్ కవితా భాష, నాటకీయ శైలిపై ఆయనకున్న ప్రతిభకు ఇది నిదర్శనమని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి ఈ సందర్భంగా అన్నారు. కళాశాల ఆంగ్ల విభాగం మరియు విద్యార్థుల కృషిని ప్రిన్సిపాల్ ప్రశంసిస్తూ ప్రతి శాస్త్రీయ సాహిత్యంతో మమేకమవడం వల్ల నైతిక విలువలను పెంపొందిస్తూనే, మేధస్సును,భావవ్యక్తీకరణను పదునుపెడుతుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆంగ్ల భాష ద్వారా విద్యార్థులు మొత్తం ప్రపంచాన్ని చుట్టి రావచ్చు అన్నారు. ఆంగ్ల భాషలో నైపుణ్యం ఎంతో అవసరం అన్నారు.

ఇలాంటి వివిధ రకాల కార్యక్రమాలు విద్యార్థులకు విద్యాభ్యాసాన్ని వాస్తవ ప్రపంచ సంభాషణ, సాంస్కృతిక అవగాహనతో అనుసంధానించడంలో సహాయపడతాయని, నిర్దేశిత సిలబస్‌కు మించి నిరంతర సాహిత్య ప్రమేయాన్ని ప్రోత్సహిస్తాయని ఆంగ్ల విభాగపు బీఓఎస్ ఛైర్‌పర్సన్ మరియు హెచ్ఓడీ పి.డి. సుజాత అన్నారు.

అధ్యాపక సభ్యులు డాక్టర్ బి.సువర్ణ, టి.రమేష్ కుమార్, పి.రామ్‌రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి ప్రసిద్ధ నాటకాలలోని కొన్ని భాగాలను వినిపించి, వాటిలోని పాత్రలు, ఇతివృత్తాలను విశ్లేషించి కార్యక్రమాన్ని సుసంపన్నం చేశారు. ఆశయం, విశ్వాసం, ప్రేమ, నైతికత వంటి అంశాలపై షేక్స్‌పియర్ చేసిన అన్వేషణ, సమకాలీన జీవితానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి అద్భుతంగా వర్తిస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో, విద్యార్థులు ఆంగ్ల సాహిత్యాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ప్రేరణ పొందారు. భాష, నాటకీయ శైలిపై తమకున్న అభిమానాన్ని ప్రదర్శించారు.

# గర్భిణీలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి**



నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భధారణ ప్రారంభం నుండి పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి ఆరోగ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కాలంలో గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. సరైన ఆహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు చిన్న వయస్సులోనే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించగా, గర్భిణీలకు సీమంతం నిర్వహించి అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో జీసీడీఓ సునీత, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మహేందర్ కుమార్, డీపీఎం డాక్టర్ భాను ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డెమో అశోక్ రెడ్డి, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, గర్భిణీలు, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు సర్కార్

**హైదరాబాద్, ఘంటారావమ్**



కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

# ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉంది..

**హైదరాబాద్, ఘంటారావమ్**



ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు.

ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు.

పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం

- ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- ఆర్టీసీ కార్మికులు ఎవరు ఆత్మహత్యలకు పాల్పడవద్దు
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట, ఘంటారావమ్ :**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ఆర్టీసీ డిపోలో పనిచేసే ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు తమ డిమాండ్ల సాధన కోసం పెద్ద ఎత్తున సమ్మె చేపడుతున్న క్రమంలో శంకర్ అనే డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవడం మరి దారుణమని ఈ ఆత్మహత్యకు కారణమైన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులకు సమాధానం చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ.. నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపో లో పనిచేసే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఆర్ టి సి జేఏసీ ఇచ్చిన సమ్మె పిలుపుమేరకు నర్సంపేటలో ఈనెల 22 నుండి పెద్ద ఎత్తున సమ్మె ఆందోళన చేపట్టారు. ఈ సమ్మె చేపడుతున్న క్రమంలో రెండో రోజు 23న సమ్మెలో భాగంగా బోళా శంకర్ గౌడ్ అనే డ్రైవర్ తమ డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మనోవేదనకు గురై తన వంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణం అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆర్టిసి జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టిసి డిపో ముందు డ్రైవర్ శంకర్ గౌడ్ చేసుకున్న ఆత్మహత్య యత్నానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డ్యాగల శ్రీనివాస్ అన్నారు. ఆర్టిసి కార్మికులు ఎవరు ఆత్మహత్య ప్రయత్నం చేయవద్దని చేతుల జోడించి వేడుకొంటున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టింపులకు పోయి ఆర్టీసీ కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

**హైదరాబాద్, ఘంటారావమ్**



తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందించారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు.


Edited, Printed, Published and Owned by Bollepelly Kishan, Printed at Sathyanarayana Printers, H.No 28-5-474/3, Reddypuram, Sai Krupa Colony, - 506001, Hanumakonda Dist. Telangana State.
Published at H.No. 10-3-488, OPP : RTC Workshop, Karimnagar- 505001, Karimnagar Dist. Telangana State. Editor : Bollepelly Kishan, RNI No : APTEL/2009/28812, Cell: 8978392904, Email: journalistkishan@gmail.com